# సంఘర్షణ

'తమ్ములంగారు దయచేసినట్టున్నారే' అన్నాడతను ఎద్దేవగా.

'ఏం? మీకు కడుపుబ్బుగా వున్నదా?' అన్నదామె నిష్ఠూరంగా. అతడు డాక్టర్ రాజారావు, ఆమె అతని ధర్మపత్ని రాజేశ్వరమ్మ.

'అదేమిటిరాజూ? బావగారు వస్తే, విసుక్కునేంత దరిద్రమా నాది? ఇకపోతే, ఆలివంకవా రాత్మబంధువులన్నారు... బావగారువస్తే లాభాల మీద లాభాలు కూడాను. వచ్చినప్పుడల్లా... అక్కయ్యకి చీర... బావమరిదికి రవల ఉంగరం... మేనల్లుళ్లకి బిస్కట్ పొట్లాలు... ప్రెజంటే షన్ల మీద ప్రెజంటేషన్లు! అని బనియన్ విప్పుకున్నాడు డాక్టరు.

'అబ్బ ఎంత చదివారండీ! పదహారేళ్లయినా ఇంకా దోచుకుతిందామనే అత్తారిల్లు? అమ్మాయి వాసంతి ఎదిగిందిగా... పెళ్లిచేసి అల్లుడికే మాత్రం బారుగా బహుమతి ప్రదానాలు చేస్తారో చూస్తానుగా... ఈ కంటిరెప్పలు దూరం కావు' అని పెనిమిటి ఎత్తుకున్న పారాయణం తుంచేసి, టర్కి తువాలందించింది రాజేశ్వరమ్మ.

ఈ దయలాగంతా పేపరు తిరిగేస్తో ముసిముసి నవ్వుకుంటో ఆలకిస్తున్న రామనాథం స్టూలు మీద నించీ లేచినవాడై –

'బావగారు పెందరాళే తెమిలారల్లే వుందే ఇవాళ? ఆపరేషన్లు లేవా యేం?' అని పలక రించాడు డాక్టర్ని.

ఆ... ఆ... నేను చెయ్యాలిసిన 'ఆపరేషన్లు' అయ్యాయనుకో, ఇహను... నన్ను ఆపరేషన్ టేబిలు మీద కెక్కించే దొరగారు వచ్చారుగా' అని రామనాథం వంక చురుక్కున చూచి కిసుక్కున నవ్వి... తువ్వాలు చుట్టబెట్టుకున్న వాడల్లా 'బాత్‌రూం'లోకి ఒక్క గెంతు గెంతాడు డా. రాజారావు.

'టీపాయి మీద నించీ 'కప్పులు' తీసి 'వాష్‌బేసిన్'లో కడిగి 'కబోర్డు'లో పెడుతోంది రాజేశ్వరమ్మ.

'చూశావా అక్కయ్యా... నేను రోజూ మీ ఆయన మీద 'ఆపరేషన్లు' చెయ్యడానికి వస్తున్నా నట' అన్నాడు రామనాధం తెల్లబోతూ.

అతగాడింకా డాక్టరుగారి విసుళ్లకి పూరాగా అలవాటు పడలేదు.

* * *

డాక్టరు రాజారావుగారి ఆపరేషన్లు అందరూ ఎరిగున్నవేను. హితోక్తుల రూపేణా... 'ఎనస్తీషియా' 'క్లోరోఫారమూ' లేకుండా సాగిపోయే చెక్కడపు పని. ఆ సందర్భమిదీ -

డా. రాజారావుగారి ఆసుపత్రి పెద్దదే. మేడ మీద ఆయన వుంటారు. కింద ఆసుపత్రి. ఆయన జిల్లా మొత్తమ్మీద పేరు మోసిన సర్జన్. ఆయన ఆపరేషన్ థియేటరు విచ్చిన కలవ పువ్వులా వుంటుంది. కత్తులూ, కత్తెరలూ 'స్టెరి లైజర్'లో ఎప్పటికప్పుడు కడిగిన ముత్యాలల్లే మిసమిసలాడుతో రెడీగా వుంటాయి. ఆయన 'ఆపరేషన్' చేస్తే పట్టు కత్తిరించినట్టు అనాయాసంగా వుంటుందని ప్రతీతి. హాస్పిటల్‌లో ఒక 'ఎక్విప్‌మెంటు'న్నదనీ ఒకటి లేదనీ అనేందుకు లేదు. ఆక్సిజెన్ సిలిండరేనా ఆల్ట్రా వయలెట్ థెరపీయేనా, సెలైన్ యాపరేటస్సేనా... వగయిరా వగయిరా పూర్తి పరికరాలతో ఆసుపత్రి కలకలలాడుతో చలివేంద్రంలా నలుగురినీ ఆకర్షిస్తో వుంటుంది.

ఆయన హస్తవాసి మంచిదని ప్రతీతి; ఆయనది రోరింగ్ ప్రాక్టీసు; స్వతహా మితభాషి; నిగర్వి; చల్లగా మాట్లాడతాడు; కోపతాపాలు ఎరగడు; రోగం చిన్నదైతే పెద్దగా చిత్రించి చెప్పి ప్రాణాలు తియ్యడు. రోగం పెద్దదయినా దాని ఉధృతాన్ని వర్ణించి చెప్పి హడలగొట్టడు. అసలు ఆయన్ని చూస్తేనే రోగం తిరుగుమొహం పడుతుందని అదోవాడిక చుట్టూతా; అందుకే ఆయనకి దేముడు డాక్టరని పేరు.

వొచ్చిన చిక్కల్లా డాక్టర్ రాజారావు అతి వుదారుడు. ఆ అవుదార్యం పేదాసాదల పట్లనయితే హర్షించతగ్గదే. కాని, డాక్టర్‌గారికలాంటి పక్షపాతం లేదు. ఉన్నవాణ్ణీ, లేనివాణ్ణీ, ఇచ్చినవాణ్ణీ, ఇవ్వనివాణ్ణీ ఒకే అంతస్తులో చూడనూ... ఒకే మోతాదులో ఆప్యాయత వొలకబొయ్యనూ... జీర్ణించిపోయిన అలవాటయి పోయింది. డాక్టర్‌గారికి ఎవరేనా ఫీజిస్తే దేనికిస్తున్నారో, ఎంత ఇస్తున్నారో కూడా అలా చూచుకునేదిలేదు; పంట్లాం జేబులో నోట్లు కుక్కెయ్యనూ... తరవాత ఇంజక్షన్‌కని అయొడిన్ స్లాబ్ చేత్తో పుచ్చుకొని 'కాంపవుండరు' నిల్చున్న రోగి దగ్గరకి జరిగిపోనూ - అదే తంతు.

దానితో... డాక్టరుగారి మంచిని దవుర్భల్యంగా ఉపయోగించుకునే ప్రబుద్ధులెక్కువయ్యారు. ఇచ్చేవాణ్ణి చూస్తే చచ్చేవాడూ లేచొస్తాడు మరి! లేనివాడూ... ఇవ్వలేనివాడూ... సరేసరి... వాడిచ్చేదిలేదు... ఈయనగారు పుచ్చుకునేదీలేదు; వాళ్లెలాగూ నెత్తిన చేతులు పెడుతోనే వున్నారు. వాడికి డాక్టరుగారి లోగిలి ధర్మాసుపత్రి క్రింద లెక్క. వాడితోపాటు... కలవాడూ... ఇవ్వగలవాడూ సాధ్యమైనంతవరకూ ఎగనామం పెట్టాలని చూస్తున్నాడు. 'ఏమీ ముట్టజెప్పని వాళ్లకన్న, దండిగా చెల్లగొడుతున్న మనకి అదనంగా ఈయన వొరగబెడుతున్నదేమిటీ?'' అని స్వగతంగానే అనేసు

కున్నారు చాలామంది.

లోకంపోకడ అల్లాంటిది?

మంచితనం మరీ చవకయితే కూరల్లో తోటకూరకాదని చూచినట్టు చూస్తారు మనిషిని!

కాగా, డాక్టరు రాజారావు స్నేహశీలి. ఆయన చేసే స్నేహాలపరిధి కూడా చాలా విస్తృత మయినది. ఉద్యోగులేనా, ఉపాధ్యాయులేనా, ధనికులేనా, నిర్ధనులేనా, కవులేనా, గాయకులేనా, ఆఫీసర్లేనా, అలగాజనమేనా... అందరూ ఆయన స్నేహకోటిలోని వారే.

దేముడు డాక్టరుగారి అభిరుచులు సైతం బహుముఖాలు. ఆయనకి సంగీతమంటే ఇష్టం. సాహిత్యమంటే ప్రీతి. సినీమాలంటే ప్రాణం. నాటకాలంటే పిచ్చి. నాట్యాలంటే వ్యామోహం. అసలు ఈ 'ప్రాక్టీసు' అందుకోకముందు 'సినీ క్రిటిక్కు'గానూ నవలా రచయితగానూ కొన్నాళ్లు కలం తిప్పి సాము గరిడీలు చేశారు. ఆయన సాహితీ బంధువుగా, కళాసింధువుగా ఏర్పరుచుకున్న సంబంధాలే గాక, స్నేహమే ఒక కళకింద మలుచుకొన్న అమృతమూర్తి. అందుచేత ఆత్మీయతా, ఆప్యాయతా కావలసిన ప్రతి వ్యక్తీ ఆయన పరిధిలోకి ఆకృష్టమై ఆయన సాంగత్యాన్ని ఆపేక్షించడం జరిగింది.

ఇప్పుడయినా ఎవరేనాదొరకాలేగాని... పట్టుకుని... ఆయా విషయాల మీద తాపీగా చర్చలు కొనసాగించే వోపిక మిగిలే వుంది ఆయనలో.

ఎటొచ్చీ రాజకీయాలతో మాత్రం ఆయన ప్రమేయం పెట్టుకోలేదు. ఆ బురదలో కాస్త అడుగుపెడితే... తక్కిన ఇన్ని రంగాలలోనూ సజీవంగా మెదులుతున్న ఇన్ని అభిరుచులూ, ఆసక్తులూ ఒక్క దెబ్బని ఎగిరి చక్కాబొయ్యేవి. కాని అది జరగలేదు.

ఏతావాత, చెప్పొచ్చేదేమంటే... ఇట్లా సాంఘిక, సామాజిక, విద్యా విజ్ఞాన సాంస్కృతిక రంగాలన్నింటినించీ అవుషధాలు అప్పనంగా పట్టుకుపొయ్యే రోగులు డాక్టరుగారి చుట్టూ పెరిగిపోయారు. కనపడితే చాలు కౌగిలించుకుంటాడాయెను డాక్టరు.

అంచాత... పోను పోను... తాము డాక్టరు దగ్గరకి వెడుతుండబట్టి ఆయన హోదా పెరిగిపోతున్నది అనుకునే ధోరణికి వచ్చేశారు చాలామంది మిత్రమహాశయులు. 'ఈయనకి 'ఫీజా'కటా పైపెచ్చు?... దండగ' అనిపించింది కొందరికి. ఆశ్చర్యమేముంది?

అయితే ఇంత ధారళంగానూ ఉచిత వైద్యం చేస్తున్న డా. రాజారావుకి రాబడి తక్కువేమీ కాదు. కాని డాక్టరుగారి చెట్టు ఎంత పెద్దదయితే దానికంత గాలితాకిడి వుంది. ఆయనకి క్షణం తీరిక లేదు, దమ్మిడి వెనకేసింది కనపడదు.

'టవున్'లోకి ఏ పెద్ద మనిషిరానీండి... డాక్టరు రాజారావుగారింట్లో ఆతిధ్యమందుకోకుండా వెళ్లినవాడిది పాపం. కనిపించింది తరవాయి... డాక్టరుగారు రెండు చేతులా ఆహ్వానిస్తారు... దానితో అవతల ఆసామీకి తప్పుకుందుకు వీలూ వుండదు... మరోచోట బసచెయ్యాలిసిన అవసరమూ కలగదు.

అయితే డాక్టరుగారు పిలిచేది ఏవొక్కరినో అయినా ఆ వొక్కరితో మరో పదిమంది ఆయన సహపంక్తిని బ్రేవుమని త్రేనుస్తో లేవకుండా జరగదు. ఆ వచ్చేది ఏ కవిగారో అయితే ఇక చెప్పాలి... ఆయన చుట్టూ కూచుని తన 'టేబిలు' మీద 'ప్లేట్లు' ఖాళీ చేస్తున్న జనాభా అంతా కవిగారి బృందమని డాక్టరుగారనుకుంటారు, అదంతా డాక్టరుగారి పరివారమని కవిగారనుకుంటారు. అంతే తేడా.

ఇకపోతే,... వచ్చీపోయే బంధు బలగమింతా అంతా కాదు. 'ట్రీట్‌మెంట్ల'కయితే అర్థం వుంది. కాని రామకోటి వుత్సవాలకనీ, వెంకటేశ్వర సప్తాహానికని, వూళ్లో నడుస్తున్న విష్ణు యాగానికనీ, ఒకటా? చెరకు వుండే చోటికి చీమలు తామే వస్తవి బారుకట్టి!

దానా దీనా... ఇంట్లో వేసేవిస్తరీ తీసేవిస్తరీను. రాజేశ్వరమ్మ సరేసరి... పెళ్ళివారువచ్చి పెరట్లో దిగినట్టే వుంటుంది ఎప్పుడు చూచినా హడావుడిగా. ఈ వంటా వార్పూ వద్దన కార్య క్రమాలకని ఇంటినిండా తొంబకింద నవుకర్లు, చాకర్లు. సేవకులింట్లో ఎక్కువయితే చేసే పనులు మిగిలిపోవూ? ఈ వచ్చీపొయ్యే జనాభాకి కాఫీ టీలకి గాను... పెరట్లో పాలిచ్చే మూడు గమిడిగేదలు, వాటికి గడ్డీ గాదం వేసేందుకూ, రెండూ పూటలా పాలు పితికి వప్ప జెప్పేందుకూ. ఇద్దరు పాలేళ్లు, వాళ్లకి అయిమూలగా ఒక రేకుల షెడ్డు.

ఇలా... ఇలా... డాక్టరుగారి కుటుంబ వృక్షం శాఖోపశాఖలుగా విస్తరించుకపోయి ఒక దివాణంగా మారింది.

* * *

రామనాథం డాక్టరుగారికి పెద్ద బావ మరిది. ఆయనది కొవ్వలి కాపరస్థలం. చదువూ సంధ్యా పూజ్యమయినా రామనాథం గొప్ప వ్యవహర్త. చాలా చాలా వ్యాపారాలలో తల దూర్చి... చక్రం తిప్పి... అలిసిపోయి... ప్రస్తుతం ఖాళీగా వున్నాడు. సొంత పెట్టుబడితో వ్యవహారం నడిపే ఆసామీ కాస్త ఆచితూచిగాని అడుగుముందుకువెయ్యడు. ఉత్తరోత్తరా అంచనాల నిచ్చెనల మీద నించీ, చొక్కాజేబూలలోకి దిగివచ్చే లాభాల మాట ఎలావున్నా... మొదట్లో పెట్టుబడికింద వెచ్చించిన మూలధనం మాయంకాకుండా చూచుకోవలిసిన జాగర్తంటూ ఒకటి తప్పనిసరిగా ఉంటుంది యజమానికి, రామనాథం చేతిలో 'క్యాపిటల్' శూన్యం. 'డబ్బు నీదీ బుర్ర నాదీ... కలబోద్దాం నడు' అని నడుం బిగించే బాపతు. అందుచేత అతని పథకాలు చాలా పెద్ద ఎత్తున నడుస్తాయి. ముగ్గులోకి దిగేముందు అతగాడు వర్ణించి చెప్పే విధానంలో అరచేతిలో వైకుంఠం అవుపించి, రూపాయల మోత మహా శ్రావ్యంగా వినిపించినా... తరవాత... రంగులు వేసి పంకాలు బిగించే సమయంలో గాలిమేడలు కాస్త పక్కకి వొరిగేవి.

అట్లాగని వ్యాపారంలో రూపాయలు పీకేసి... సొంత జేబులు నింపేసుకుని... జాయింటుదారు నెత్తిన చేతులు పెట్టి టోకరా యిచ్చే గాది కింద పందికొక్కు జాతి కాదు రామనాథం. 'పెట్టుబడి మనదికాదూ' అన్న తరువాత మనకి తెలీకుండానే... మనలో పొంగులు వారే ధైర్య సాహసాలు అలాంటివి! ఆ తరవాత మనం వొదిలే గాలిపటాన్ని నొక్కి పట్టే దారం

కాస్తా పురివిచ్చిపోతుంది. అప్పిస్తే ఏనుగుని కొనేస్తానంటాడు రామనాథం.

రామనాథం ఈ డాక్టరు బావగారి ఖర్చూ... ధర్మసత్రం కింద నడుస్తున్న ఇల్లూ వాకిలి... అన్నీ నిశితంగా పరిశీలించాడు. ప్రస్తుతం కొవ్వలికీ ఏలూరికీ మధ్య నడుస్తున్న తన నిరుద్యోగ యాత్రలో డాక్టరుగారి సంపాదనని ఒక దారికి తీసుకురావాలనీ... ఆయన వుదారంలోని దూకుడు కాస్త తగ్గించాలననీ... ఇక్కడికి రాకపోకలు సాగిస్తున్నాడు. అడపాతడపా వచ్చినప్పుడల్లా... అక్కయ్యని మధ్య పెట్టుకుని బావగారి చెవికెక్కని హితబోధలు పదేపదే చేసి చక్కా పోతున్నాడు. అవీ రామనాథం 'అపరేషన్లు'.

* * *

డాక్టరు రాజారావుకి ముగ్గురాడపిల్లల తరవాత ఇద్దరు మగ నలుసులు. పెద్దమ్మాయి వాసంతి కాలేజీ చదువు మహోజ్వలంగా సాగిస్తున్నది. తక్కిన పిల్లలు కాన్వెంటు స్కూళ్లలో, కిన్‌డర్ గార్డెన్లలో ఖరీదైన విద్యలే కట్టుబాటుగా నేరుస్తున్నారు. మళ్లీ అందరికీ ట్యుటోరియల్ కాలేజీలలోనూ, ఇంటి దగ్గరా... ట్యూషన్లు ప్రత్యేకించి ఉండనే ఉన్నయి.

ప్రస్తుతం మూడు పువ్వులూ ఆరుకాయలు గానే ఉంది డా. రాజారావుగారి పని.

కాని పెద్ద పిల్ల పెద్ద చదువులు చదువుతున్నదన్న ఎక్తారీలో... ఆమెకీ పెద్ద వయస్సు... అంటే పెళ్లి వయస్సు దగ్గర పడుతున్న వయనం అడుగున పడిపోతోంది. గృహలక్ష్మి అయ్యే ముందు ధనలక్ష్మి కూడా ఆమె వెనకాల రెండడుగులు వేస్తేనేగాని ఏ గృహ ద్వారాలూ తెరుచుకోవన్న చేదునిజం... ఆకాశమ్మీద విమానయానం చేస్తున్న డాక్టరుగారి చూపుకింకా అందలేదు. ఆయన మహానుభావుడు! ఈ నేల మీద రేగే దుమ్ముకీ ధూళికీ అతీతుడు!!

'అయితే, బ్యాంకులో నిలవేమాత్రముంది అక్కయ్యా?' అని అడిగాడొకనాడు రామనాథం. పకాలుమన్నది రాజేశ్వరమ్మ.

'హయ్యో రాత... బ్యాంకు బాలెన్సొక'టా నాయనా, కదిలే జీవనది లాంటిదిరా మా యిల్లు. నీళ్లు నిలవుంటే పాకుడుపట్టి పసరెక్కిపోదూ?' అన్నది.

'మరి రేపు పిల్లకాయలు పెళ్లికున్నారు, బావగారి పామేదాకి తగ్గట్టు రాముని, గోపిని పెద్ద చదువులు చదివించాలి. ఎన్నెన్ని బరువు బాధ్యతలు ముందున్నయ్యో తెలుసునా? రోజులన్నీ ఒక్కలా వుండేనా?

దీపముండగానే ఇల్లు చక్క బెట్టుకోవాలి... నూనె లేని ప్రమిదలో వత్తి చరచరా కాలి పోతుంది మరి. దప్పిగొనకముందే తవ్వాలి బావి. కళ్లున్నప్పుడే కాటుక పెట్టుకోవాలి, అవి పోయింతరవాత సూర్య నమస్కారాలు చేదామంటే కాదు. కాలానికి రుతువులు మారినట్టే మనిషి అయిశ్వర్యానికి, అదృష్టానికీ ఆటూపోటూ వుంటుంది. 'రూకలేని వాడు పోకచెయ్యడు' అని హితం చెప్పాడు రామనాథం.

'ఏమి చెయ్యను తమ్ముడూ? నిజానికి నమ్ము నమ్మకపో... మీ బావగారిది కన్ను చెదిరే

సంపాదననుకో... కాని ఏమి లాభం? ఒక్క పైసా వెనకేసిందికి లేదు. ఎడారిలో తుఫాను వస్తేనేం గాక, ఎక్కడిదక్కడ ఇంకిపోతున్నదనుకో" అని తుంచేసింది రాజేశ్వరమ్మ.

ఇకపోతే ఎవరికైనా సంపాదనకి కొన్ని పక్కదార్లుంటయ్యని తెలియనే తెలియదాయనకి.

అక్కడకీ, సత్యన్నారాయణ వ్రతమని ఒకసారీ... మేడమీద హాలు వేసి గృహప్రవేశం పేరుపెట్టి ఇంకొక తూరీ, డాక్టరు బావని పీటమీద కూచోబెట్టి, చదివింపులంటూ ఒక తతంగం నడిపి, పదిహేను పదహారు వేలు రాబట్టి బ్యాంకులో వేయించాడు రామనాథం. డాక్టరికి ఇలాంటి పక్కవాటు సంపాదనలంటే చికాకు. చిన్న చిన్న రోగాలొచ్చి వైద్యం చేసినప్పుడు... మొహమాటాలకి పోయి వొదులుకున్న చిల్లరమల్లర కేసులన్నీ ఇలాంటి శుభసమయాలలో కూడదీసుకోవచ్చును బావా అంటే మొహం చిట్లిస్తాడు; ఇందులో బలవంతాన గుంజుకున్నదేముందీ?

అడ్డమైనవాళ్లూ 'మెడికల్ సర్టిఫికెట్లూ', 'ఫిజికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్లూ' తేరగా రాయించుకు పోతున్నారు డాక్టరుగారి దగ్గరనించీ. 'సర్టిఫికెట్టు'కింతా అని 'చార్జీ' చెయ్యవయ్యా అంటే, 'ఎరిగున్నవాడు – ఎలా అడగనూ? అంటాడు, ఎరగనివాడి దగ్గర మహ నిక్కచ్చిగా వసూలు చేసినట్టు!

ధనాశ అంటూ లేకపోయింతరవాత సంసారి అన్నవాడు ఎట్లా కొరగానివాడైపోతాడో వెయ్యివిధాల చిలవలు పలవలుగా వర్ణించి చెప్పాడు రామనాథం. వింటేనా?

ఇట్లా కాదని 'యక్స్–రే క్లినిక్కు' ఒకటి పెట్టించాడు డాక్టరుచాత. డాక్టరుచేత పదకొండణాల వాటాలు కొనిపించాడు. తతిమ్మా వాటాలు చిల్లరమల్లరగా 'టవున్‌లో' ఇతర డాక్టర్లు సర్దుకున్నారు... వూళ్లో యక్స్–రే క్లినిక్కంటూ వొకటి లేదు. లాభసాటిగా వుండచ్చు.

* * *

'రండి రండి... బహుకాల దర్శనం' చిరునవ్వుతో ఆహ్వానించాడు డా. రాజారావు. కూచున్నారు కోటిలింగంగారు.

బొత్తిగా నల్లపూసయిపోయినారే? అని ఇష్టంగా నవ్వాడు డాక్టరు.

'ఏదో ఈ మధ్య వొంట్లో కాస్త ఆరోగ్యంగా వుంటోందండి' అని నసిగాడు కోటిలింగం హాస్యంగా.

'అంటే ఏదో రోగం వస్తేనేగాని నాకు కనపడరన్నమాట' పకాలుమన్నాడు డాక్టరు.

'అంతేగదండీ రుగ్మత లేనప్పుడు గూడా డాక్టరుగారి టయిము తినేందుకు వస్తే లేని రోగాలు సయితం గుర్తుకి రావచ్చు!'

ఇద్దరూ కలివిడిగా నవ్వుకున్నారు.

కోటిలింగంగారు మోతుబరి ఆసామీ. టవున్‌లో పెద్ద 'బిజినెస్ మేగ్నెట్ ' డాక్టరికీ ఆయనకీ దోస్తీ.

'వారం రోజుల నించీ అప్పుడప్పుడూ సాయంత్రం వేళ ఉష్ణం తగుల్తోంది... అన్న హితవు లేదు... నోరు అరుచిగా వుంటోంది. వల్లమాలిన నీరసం' వచ్చిన పని వివరంగా చెప్తున్నాడు కోటిలింగం.

కాంపవుండర్ని 'టెంపరేచర్' చూడమన్నాడు డాక్టరు.

స్టెతస్కోపుతో ఛాతీ పరిక్షించాడు. ఊపిరి తిత్తులలో గురగుర ఏమీ లేదు. పెన్సిలిన్ అయిదు డోసులిస్తే సరిపోతుంది.

ఆలోచించాడు డాక్టరు. ఎందుకైనా మంచిది. యక్స్-రే ఫొటో తీయించుకురమ్మనమని రిక్విజిషనిస్తేనో? చీటీవ్రాసి ఫొటో తీసుకొచ్చి చూపమన్నాడు. 'యక్స్-రే క్లినిక్'కి అనుబంధంగా లేబొరేటరీ కూడా వోపెన్‌చేశారు. కళ్లీ నీరుడూ రక్తమూ కూడా పరీక్షకి పెట్టాడు.

కోటిలింగానికి గుండె గుభిల్లుమంది. కొంప మునుగుతోందా ఏమిటి చెప్మా? నిలువుగుడ్లు పడిపోయి నిల్చుండిపోయాడు ఆమట్న.

'మరేంఫరవాలేదు... ఆందోళనకి ఆస్కారం లేదనుకోండి. అయినా అనుమానం నివృత్తి చేసుకున్నది రైటుకదా' అని పంపేశాడు డాక్టరు.

కోటిలింగం ట్రీట్‌మెంట్ వారంరోజులు నడిచింది.

మధ్యలో ఒకసారీ... ఆఖర్న మరోసారీ ఫొటోతోసహా పరిక్షలన్నీ యధావిధిగా జరిగిన్నై. పరీక్షలు దేనికి దానికి 'లేబరేటరీలోనూ' 'యక్స్-రే క్లినిక్'లోనూ వేరువేరుగా చార్జీలు చెల్లించి పరిక్షా ఫలితం ఎప్పటికప్పుడు డాక్టరు చేతిలో పెడుతున్నాడు కోటిలింగం.

ఆఖర్ని సెలవు తీసుకొంటూ ఏదో ఫీజు చేతిలో పెట్టాడు. నోట్లు పంట్లాం జేబులోకి తోసేశాడు డా. రాజారావు.

* * *

రాత్రి 'నైట్‌క్వీన్' విరగ బూసిందేమో సువాసనలు చెరిగిపోస్తోంది! చందమామ తెల్లని మబ్బుల్లో దూరి దోబూచులాడుతోంది. పెద్దమ్మాయి వాసంతికి పరీక్షలు దగ్గరపడిన్నై గావును పుస్తకాలు ముందేసుకుని... గదిలో టేబిలు 'లైటు' ముందు కూచుని... తుమ్మెద ఝూంకారం చేస్తున్నట్టు... పాఠాలేవో గొణగొణ కంఠస్తం చేస్తోంది.

డాక్టర్‌కెంతకీ నిద్రపట్టలేదు. ఎప్పుడూ ఆదమరచి నిద్రపోయే అలవాటాయనకి. ఆలోచనలు గిర్రున తిరుగుతున్నాయి బుర్రలో. అందుకని నిద్రపట్టటం లేదా, లేక నిద్రపట్టక ఆలోచనలు చెలరేగుతున్నాయా? తను గాడితప్పి మామూలుకి భిన్నంగా నడిచాడావేళ. అదీ తపన!

కోటిలింగానికి మామూలు జ్వరమేను; దానికి వాడింది మామూలు పెన్సిలిన్ డ్రగ్గేను.

ఇంకో పేషెంటయితే అసలు 'ఫీజే' అఖ్కర్లేదనేవాడు డా. రాజారావు. కోటిలింగం దగ్గర

ఈ చిన్న సాదా జ్వరానికి ఇంతఫీజు తీసుకున్నందుకు గుండె పీకుతోందా? ఇంత ఇమ్మనీ అంత ఇమ్మనీ తను దేవిరించాడా? అదేం లేదా?...

ఇకపోతే, కోటిలింగం సన్నకారు మనిషేమీ కాదు. అతనికెంత ఆస్తి వున్నదో అతనికే తెలీదు. ఆ మాటకొస్తే... దానికి ఎన్ని అంకెలు కూడాలి, ఎన్ని 'బిల్డింగులి'కి విలవకట్టాలి - ఎన్ని 'ఫ్యాక్టరీల'లో షేర్లు గుణించాలీ? అతను చేస్తున్న దానధర్మాలా కోకొల్లలు! రాముడి పెళ్లనీ, దేముడి యజ్ఞమనీ, కామాక్షి సప్తాహమనీ... తలా ఒకరూ వచ్చి... ఎప్పుడూ ఏదో దండుకొని పోతోవుంటారాయన దగ్గర్నించీ. ఆయన 'బిజినెస్సు' ఉచ్చదశలో వుండగా చూచి, 'నీ గురుడు ఏకాదశమందున్నా'డని జాతకం చెప్పీ... ఏవేపునయినా సందర్భం కలిసిరాక కాస్త దిగాలుగా వున్నప్పుడు పసిగట్టి... గ్రహ దోష నివారణకని పరిహారాలు సూచించీ... అతని దగ్గర వందలు వందలు దానాలూ దక్షిణలూ పట్టుకుపోయిన జ్యోతిష్కులూ సిద్ధాంతులూ తొక్కితే లేస్తారు చుట్టుపక్కల. అతని దగ్గర నించి 'ఫీజు' దండిగా గుంజితేనేం? మూడు 'యక్స్-రే ఫొటోలు' తీయిస్తేనేం తీపరమా? విషజ్వరం కాదన్న సందేహం నివృత్తి చేసుకుందుకు 'ఫోటోలు' తీయించాలిసొచ్చింది తనూ. అందులో తప్పేముంది? అది మామూలు జర్వమేను అని వొక నిర్ధారణ కొచ్చేందుకు తన డిగ్రీ, తన విజ్ఞానమూ, తన అనుభవమూ అక్కర కొచ్చినయ్యా లేదా? వాటి విలువ ఇరవయ్యంటే ఇరవై, నలభైయ్యంటే నలభై. ఖచ్చితంగా రోగనిదానం చేసి మరీ 'ట్రీట్‌మెంటు'కి దిగాలి గదా తను? అదితప్పా? ఫోటోలు చూచింతరవాత... కళ్లి పరిక్షకి పట్టిన తదుపరి... ఇది క్షయకాదనీ... మామూలు జ్వరమేనని... ఒక నిర్ధారణకి వచ్చాడు గాబట్టి సరిపోయింది. లేకపోతే... అది 'మలేరియా' అని కొన్నాళ్లూ... టైఫాయిడ'ని కొన్నాళ్లూ, బిళ్లలూ, ఇంజక్షన్లూ వాడి వాడి... అది కొసకి ఏ విషజ్వరమోనని తేలినాక... అప్పటికే అది తన చెయి దాటిపోతే... తను కక్కుర్తిగా వైద్యం చేస్తున్నట్టు లెక్కకి రాదా? అంతరాత్మ ఏదో గోల చేస్తోంది తప్ప, తను చేసిన అపరాధమేమున్నది ఇందులో? భయంకరమైన వ్యాధి లక్షణాలేవో పొడ చూపినట్టూ, డాక్టరు చక్రమడ్డేసినట్టూ, అతగాడు 'ఫీల'యి తనకి ఫీజు కాస్త ఎక్కువగా ముట్టజెబితే తన మోసమేమున్నదనీ' ఈ ప్రశ్నలన్నీ లోపల్నించీ పరంపరగా దూసుకొచ్చి నిలబడుతుంటే, తాపీగా సమాధానాలు చెప్పుకొంటో పోతున్నాడు డాక్టరు.

ఆ తర్వాత ఫోటోలు తీయించుకు రమ్మనమని చాలా మందికి 'రెక్విజిషన్లు' వ్రాసి బెత్తాయించాడు డాక్టరు. వాళ్లల్లో కలవాళ్లున్నారు, లేనివాళ్లున్నారు, కాని తనేం చెయ్యగలడు? అనుమానముంటేనే 'యక్స్-రే క్లినిక్కు'కి పోమ్మంటున్నాడు తను. తన 'డ్యూటీ' తను చెయ్యాలి గదా - ఆ.

ఇంతాజేసి ఫోటోలు తీయించుకురమ్మని డా. రాజారావు పంపిన రోగుల సంఖ్య బహు స్వల్పం. తతిమ్మా డాక్టర్లు పంపిన కేసులు కోకొల్లలు. పదకొండణాల వాటాదారు కాబట్టి 'క్లినిక్కు'కి వచ్చిన లాభాలు పంపిణీకి వచ్చేసరికి హెచ్చుభాగం డా. రాజారావు పరమవుతున్నాయి. దానితో డాక్టర్లకి కాస్త కంటగింపుగానే వుంది. ఒకసారి రామనాథం గుణిశాడు కూడాను అట్లాగని. రాజారావుకి తట్టుగాలి వచ్చింది. ఈ రామనాథానికి ఇంట్లో మెల్లిమెల్లిగా పెత్తనం

చేజిక్కుతోంది. ఇతగాడు ఒకరవ్వ కాల్చుమంటే వొళ్లంతా వాతలు పెట్టేలా వున్నాడు. అయిన దానికీ కానిదానికీ 'ఫొటో'లకి 'రిక్విజిషన్లు' బరికెయ్యమని ఇతని సలహానా? అక్కడికీ తను యధాశక్తిగా 'క్లినిక్కు'కి పని జెబుతోనే వచ్చాడు అంతరాత్మ నోరునొక్కి.

ఈ వాదోపవాదాలన్నీ ఎందుకు బయల్దేరినయ్యో డా. రాజారావుకర్థంకాలేదు. ఎవరడిగా రనీ తనని? ఫొటోలు తీయించుకు రమ్మనమని 'అద్దమైన వాళ్లనీ ఎందుకు తరుముతున్నావూ?' అని ఎవరు నిగ్గదీసారు తనని? ఆ మాటకొస్తే తను జాస్తిగా ఫోటోలు పత్రమ్మని సాగించిన తరవాతనే తనకెక్కువ పేరొచ్చింది; ఏదో ముంచుకొస్తుంటే ఆనకట్ట వేసినట్టూ... మహా జాగర్తగా ట్రీట్‌మెంటు చేస్తున్నట్టూ...' కర్ణా కర్ణిగా మ్రోగుతున్నది కూడానూ చుట్టుపక్కల.

అంతవరదాకా ఎందుకూ? కోటిలింగానికి ఎంత తృప్తిగా వున్నదనీ తను మూడు ఫొటోలు తీయించినందుకు!

నిశ్చింతగా కన్నుమూసుకున్నాడు డాక్టరు. గాఢంగా నిద్ర పట్టేసింది.

డాక్టరుకే తెలియదు; మనస్సు మహా చెడ్డది; తనకిష్టమయిన పని ఏదిగానీ, అది సజావ యిందనీ, సబవయిందనీ, దాఖలాలతో సహా మన ముందుంచి వొప్పిస్తుంది. అందాకా ఎందుకూ? ఒక దొంగనీ, ఒక హంతకుణ్ణీ నిలబెట్టి పలికిస్తిమా... ఆ దొంగతనమూ, ఆ హత్యా సక్రమమైన వేనూ అని, సహేతుకంగా, యుక్తియుక్తంగా కాదనేందుకు వీలులేకుండా నిరూపణ చెయ్యగలదు.

* * *

'మీ తమ్ములంగారు సంచార మంత్రిత్వశాఖ నిర్వహిస్తో... ఏలూరు రోడ్లు సర్వేచేస్తో కాలక్షేపం చేసే బదులు... ఏదయినా వుద్యోగమొకటి సంపాదించుకుని రాచరికాలు వెలిగించ గూడదూ? అన్నాడు డాక్టరు వంకాయి కూరలో బఠానీలు రుచి చూస్తో.

'డైనింగ్‌హాలు'లో 'టేబిల్ మీల్స్' తీసుకుంటున్నారు డాక్టరు దంపతులిద్దరూ.

'వెన్న చేతులోబెట్టుకొని నేతికేడ్చినట్టుంది. చెట్టంత బావగారుండగా మా తమ్ముడికేం కొదవ? ఏదో వొకదారి చూపండి మరి' అని పింగాణి ప్లేటులోకి 'క్యాబేజీ సూప్ వొంపింది రాజేశ్వరమ్మ.

నేనా? ఆయనగారికా? ఉద్యోగ ప్రదానమా? అన్నాడు డాక్టరు బిత్తరపోయి.

'రాత్రి అదే అనుకున్నాము' అన్నది రాజేశ్వరమ్మ ముక్తసరిగా.

“ఏమని?' ప్లేట్లో స్పూను అట్లాగే వుంచి భార్యారత్నం వంక ప్రశ్నార్థకంగా చూశాడు డాక్టరు.

'మీరు 'ప్రిస్క్రయిబ్' చేస్తున్న మందులే వేనకు వేలు ఖరీదుంటయ్యట. ఒక 'మెడికల్ స్టోర్సు' పెడితేనో? తమ్ముడు 'మేనేజిమెంటు' చేస్తాడు. ఆలోచించండి?

'ప్లేట్లో స్పూను' మళ్లీ పని చెయ్యడం ప్రారంభించింది.

'అలా చెప్పు' ఏదో 'స్కీము' ముందే తయారై వున్నదన్నమాట. నేను 'మెడికల్ స్టోర్సు' పెట్టి... నాదగ్గరకి వచ్చిన పేషెంట్లందరినీ నా 'స్టోర్సు'లోకి వెళ్లి అవుషధాలు కొనుక్కురమ్మనమని తరిమితే... ఈ టవున్‌లో డాక్టరుగా నా పరపతేముంటుంది హనూ?

'అబ్బ – మీ పేరు మీదగా ఎందుకుంటుందండీ స్టోర్సు? మా తమ్ముడు పేరనే తెరవచ్చును. పేరు వాడిదీ లాభాలు మీవి? ఇంతని జీతమివ్వండి వాడికి చాలు.

డాక్టరు ఆలోచించాడు.

ఈ మధ్య 'క్లినిక్కు' మీద అప్పుడు కొంతా అప్పుడు కొంతా పైకం వెనకేసుకునే అలవాట్లు మెల్లిమెల్లిగా వొంటబట్టించుకుంటున్నాడేమో 'బ్యాంకు పాస్ బుక్కు' అడపాతడపా చూచుకొంటున్నాడు రాజారావు. అయిదువేల పైచిలుకు నిలవ తేలినప్పుడు, ఆరువేల అంకె మీదకీ, ఏడువేల దాకా పూడిన తరవాత, ఏడు దుశ్శబ్దమనిపించి, ఎనిమిదివేల సంఖ్య మీదకే చూపుసాగారుతోంది.

'మరి దానికెంత పెట్టుబడి గావాల్నో ఏమిటో? మొగ్గే ముందు కాస్సేపు నీళ్లు నమిలాడు డాక్టరు.

'ఆ మాత్రం మనదగ్గర లేకపోలేదు లెండి. తాడూ బొంగరం లేకుండా దిగుతామా? కార్యేషు మంత్రీ అనిపించుకున్నది రాజేశ్వరమ్మ.

'సరే కానిమ్మను'. 'వాష్ బేసిన్'లో చెయ్యి కడుక్కుని 'న్యాప్‌కిన్'తో మూతి తుడుచుకుని క్రిందికి దిగిపోయాడు డాక్టరు.

ఒక నమ్మకముంది డాక్టరుకి. రామనాథం ఏ వ్యాపారం చేయించినా దిగమింగుడు వ్యవహారాలకి మాత్రం దిగడు.

ఇన్నాళ్లూ డాక్టరుగా ఉన్నతంగా బ్రతికాడు తను. ఇప్పుడు మెడికల్ స్టోర్సు పెడితే తప్పేముంది? తను మీనమేషాలు లెక్కబెడుతున్నాడు గాని... తెలివిగలవాళ్లు వ్యాపారం చేసి లక్షలు వోగేసుకోవడం లేదూ? ఆమాట కొస్తే వ్యాపారం కానిదేమున్నది? ఇరవైవేలు ఖర్చుపెట్టి 'యం.బి.' చదివి, 'స్టెతస్కోపు' మెళ్లో వేసుకుని, నాలుగు రూపాయల మందు వాడి, నలభై రూపాయలు 'ఫీజు' రాబట్టుకోవడం వ్యాపారం కాదాయేం? వేషమెంత మార్చినా, విద్యలెన్ని నేర్చినా వ్యాపారం కాని వ్యాపారాలెన్ని మన చుట్టూతా నడుస్తున్నయ్యనీ! గల్లా పెట్టీ, చిటా ఆవర్జాలూ లేకుంటే సరిపోయిందీ?

ఈ తర్కంతో డాక్టరుగారి అంతరాత్మ నోరు మూసుకుంది.

'వులెన్‌పాంటు' 'వోపెన్‌షర్టు' మీదకి 'టకప్' చేసుకుని టక టక మెట్లు దిగిపోయాడు డా. రాజారావు.

'సంజీవినీ మెడికల్ స్టోర్సు' వెలిశింది. రామనాథం రొట్టె నేతిలో పడింది.

డా. రాజారావుకి దానితో ఏమీ సంబంధం లేనట్టు లెక్క. 'డ్రగ్‌స్టోర్ లైసెన్సూ' నార్కొటిక్

డ్రగ్గులికి 'ఎక్సైజ్ పర్మిట్లూ' అన్నీ రామనాధం పేరునే ఉన్నాయి.

మెడికల్ స్టోర్సులో అమ్మకాలు జ్వాజ్వల్యమానంగా సాగుతున్నాయి. కొత్త నీటికి చేప ఎదురెక్కినట్టు చకచక అమ్మకాలు సాగిస్తున్నాడు రామనాధం. మొదటినెల వెయ్యి, రెండో నెల మూడువేలు... అలా అలా పెరిగిపోయినయ్యి అమ్మకాలు.

అంతవరకూ డాక్టరు రాజారావు 'మెడికల్ రిప్రజంటేటివు'లిచ్చిన సాంపుల్ ప్యాకెట్లలో నించీ బిళ్లలుగానీ, 'వయాల్స్'గాని 'యాంపూల్సు'గానీ వచ్చిన పేషంట్లకి విచ్చలవిడిగా ఖర్చు పెట్టే రివాజు. 'స్టోర్సు' పెట్టింది లగాయతూ, ఏ 'క్లయింట్లు' వచ్చినా ఫలాని 'డ్రగ్గు' తెచ్చుకో మని 'ప్రిస్క్రిప్షన్' వ్రాసివ్వడం సాగించాడు. వాళ్లు పక్కన 'సంజీవిని మెడికల్ స్టోర్సు'లో నించీ కొని తెచ్చుకున్న తరవాత... అవి ఎలా వాడాలో తబిశీలుగా చెప్పి బెడద వదలించుకుంటున్నాడు. దానితో డాక్టరు 'ఫీజు' ఎగవేసింది చాలక, దర్జాగా అవుషధాలు సమేతూ బేవార్సుగా పట్టుకుపోయే ఘరానా మనుషుల తాకిడీ కాస్త తగ్గింది.

'పేషెంట్ల'కి కూడా తృప్తిగానే వున్నదీ పద్ధతి.

ఎప్పుడైనా ఏ సన్నకారు 'పేషెంటు'కేనా ఆసుపత్రి మందిచ్చి పంపుదామని చూచినా, 'మెడికల్ సాంపుల్స్' బీరువాలో బొత్తిగా కనిపించడంలేదు డాక్టరికి.

డా. రాజారావుకి చట్టున స్ఫురించింది. రామనాధం ఆశాపాతకుడు. ఆసుపత్రిలో వున్న 'సాంపుల్స్' కూడా 'స్టోర్సు'కి పట్టించేస్తున్నాడేమో దారుణంగా. అవి అమ్మకూడదు నిజానికి. ఆ ప్యాకెట్ల మీద, ఇది 'డాక్టరికిచ్చిన నమూనా - అమ్మకానికి కాదు' అని ఇంగ్లీషులో అచ్చుగొట్టి వుంటుంది కూడాను.

'సాంపుల్స్ ఏమవుతున్నాయి? అని కాంపవుండర్ని అడుగుదామనుకున్నాడు. కాని ఎందుకో అడగలేదు, అడిగినట్టయినా, రామనాధం మోసుకుపోతున్నాడని బైటపెట్టక మానడు. ఆపైన రామనాధన్ని నిలెయ్యాలిశివస్తుంది. తరవాత నడిచే తంతు చాలా చికాకుతో కూడుకున్న వ్యవహారం. రామనాధమంటే డాక్టరుకి ఒక విధంగా అసహ్యమూ, కాస్త భయం కూడాను. మెదలకుండా వూరుకున్నాడు.

తరవాతనిపించింది, సాంపుల్సమ్ముకోవడం తనకీ యిష్టమేనా కొంపతీసి?

ప్రాక్టీసు యధావిధిగా సాగిపోతూనే వుంది. చెదురుగా వస్తున్న పదులూ వందలూ ఇంటివాడకానికని యెప్పటికప్పుడు ఖర్చయిపోతూనే వున్నాయి మామూలు ధోరణిగా. 'ఎక్స్-రే క్లినిక్కు' మీదా, మెడికల్ స్టోర్సు మీదా వస్తున్న లాభాలు వేల మీద వుంటున్నాయి. అది రాగానే చేజిక్కించుకుని చెదిరిపోకుండా 'బ్యాంక్ ఎక్కవుంట్' కెక్కించి జాగర్త పడుతోంది రాజేశ్వరమ్మ.

* * *

ఆమధ్య ఒకసారి 'ఎక్కవుంటు' తిరగెయ్యడంలో అందులో చూపిన లాభం కన్న ఎక్కువ మొత్తం తనకు ముడుతున్నదని గమనించాడు డాక్టరు. ఎక్కువ ఎలా ముట్టజెబుతున్నాడబ్బా? చిత్రంగానే వుంది.

ఈ మెడికల్ స్టోర్సు పెట్టిన తరువాత రామనాధాన్ని చూడటమంటే కాస్త బెరుగ్గానే వుంది డాక్టరికి. ఎక్కడ ఏ మురుగు కాలవలోకి దింపుతున్నాడో అన్న భయమే!

ఈలోగా ఒక వాడుదుడుకు వ్యవహారం బయటపడింది. ఒక 'హార్టు పేషెంటు'కి గుండె నొప్పి కనిపిస్తే 'పెథిడ్రిన్' తెచ్చుకొమ్మని 'ప్రిస్క్రిప్షన్' వ్రాసిచ్చాడు డాక్టరు. 'సంజీవినీ మెడికల్ స్టోర్సు' నించీ మూడు రూపాయలిచ్చి కొనుక్కుతెచ్చుకొన్నాడు. అది కంట్రోలయిన డ్రగ్గు. ముప్పావలా కన్న యెక్కువమ్మగూడదు. రామనాధం... వీడి కక్కుర్తిమండ... తనకి తెలీకుండా అవుషధాలు 'బ్లాక్'లో అమ్ముతున్నాడా కొంపదీసి? దినం మంచిదని తెల్లవార్లూ దొంగలించి నట్టుంది! అవలక్షణం గలవాడికి అక్షింతలు వేస్తే, నెత్తిమీద నించీ తన నోట్లో వేసుకున్నట్టున్నాట్ట!! మొన్న 'స్టోర్సు'లో ఒక బేడ వాటా తీసుకోమన్నాడతన్ని. అప్పటినించీ పుట్టిందా ఈ బుద్ధి!

తళుక్కున మెరిసింది, నిన్న ఎక్కవుంట్లు చూస్తుండగా తన కొచ్చిన ధర్మసందేహం... ఏదీ?... పద్దులేని లాభాలు తనకెలా దఖలు పడుతున్నయ్యా అన్న మీమాంస... ఇప్పుడు తీరిపోయింది.

రువుతు మెత్తనైతే గుర్రం మూడుకాళ్లతో నడుస్తుందిట. రామరాధాన్ని చివాట్లు వెయ్యాలి. ఈసారి బాగానే కోపం వచ్చింది డాక్టర్కి. ఇట్లాంటి నకిలీ వ్యవహారమంటే తనకి కంపర మెత్తుతుంది.

దూకుడుగా మెట్లెక్కి రాజేశ్వరమ్మ మీద విరుచుకుపడ్డాడు.

అంతా వింది రాజేశ్వరమ్మ. 'మెడికల్ స్టోర్స్' పెడితే లక్షణంగా డబ్బు చేసుకోవచ్చును అనుకున్నదామె. అంతే. అందులో తప్పేముంది? కాని వక్రమార్గాన ఆర్జించుకోవాలన్న కక్కుర్తి ఆమెకే కోశానాలేదు. తమ్ముడెందుకిలా అడుగడుగునా పెనిమిటికిష్టంలేని అడ్డదార్లు తొక్కుతున్నాడో అర్ధంకాలేదామెకి.

డాక్టరూ తొందరపడదలచుకోలేదు. ఇంతకీ... బ్లాక్లో మందులమ్మి కురదలా జేబులో వేసుకుంటున్నాడా అంటే అదేంలేదు. అదంతా డాక్టరికే ముట్టజెబుతున్నాడు. ఆ దుస్సంకల్పమే వుంటే డాక్టరుకి తెలీకుండానే, చీకటి బజార్లో అవుషధాలమ్ముకుని లెక్కలలో కంట్రోలు రేటుకే అమ్మినట్టు చూపి అదనపు పైకం చల్లగా గుటకాయస్వాహా చెయ్యవచ్చును గదా బావమరిది? దొంగతనంలో మళ్లీ కొంత నీతీ నిజాయితీ! ఇతగాడికి తనకేదో అయిశ్వర్యం తవ్వితలకెత్తుదామని తాపత్రయం దేనికీ? ఆ తపన మీద అప్రాచ్యపు పనులికి దిగి, తన పరువూ ప్రతిష్టా గంగలో కలపటం దేనికీ?

డాక్టరుకి అనుభవం లేదుగాని, కొందరికి అడ్డకోలుగా డబ్బు వొల్లడమంటే మహాసరదా.

అట్లాంటి అవకాశాలు జారవిడుచుకున్నప్పుడల్లా పశ్చాత్తాపంతో కుమిలిపోతారు. ఫస్టు తారీఖున టంచన్‌గా వచ్చేజీతపురాళ్లు మట్టీ మశానమూ, టేబిలుకిందనించీ అంది పుచ్చుకునే పదిరూపాయల నోటు బెల్లంముక్క, మార్కెట్లోకొని సంచిలో వేసుకునే మామిడికాయ వెల ఒక అణా, కోరడి పక్కనే పోతోపోతో... తోటమాలీ కన్నుగప్పి కోసుకున్న మామిడిపిందె ఖరీదు ఒక రూపాయి. దాని రుచి చెప్పడానికి వీలులేదు!

'ఆ పాపపు సొమ్మేదో నువ్వే తీసుకో' అని రామనాథం మొహాన్ని కొడదామనుకున్నాడు డాక్టరు. కాని-

'నేను ముదలకిస్తాలెండి... మీరూరుకోండి... నలుగురూ చేస్తున్నపనే గావును గోల! అంచాత 'బ్లాక్'లో మందులమ్మడమనేది మీరనుకున్నంత మహాపరాధం కాదనుకుంటున్నాడేమో తమ్ముడు. గోరంత వుంటే కొండంత చేస్తున్నారు మీరు మరీన్నూ' అని సాగతీసింది రాజేశ్వరమ్మ.

డాక్టరు చల్లబడ్డాడు.

రాత్రి భోజనాల దగ్గర కూర్చున్న తరువాత ఆయన కోపం పూరాగా కాకపోయినా చాలా భాగం దిగజారింది. కాలీఫ్లవర్ పెరుగుపచ్చడి మహాపసందుగా కుదిరింది. ఒకటికి రెండుసార్లు మారు వడ్డించుకోవడంలో ముఖ్యాంశం అడుగున పడిపోయింది.

ఆఖర్న... ఎట్లాగయితేనేం... తెగించి... మందలింపుగా-

'రామనాథం - డ్రగ్గులు 'బ్లాక్' చేసేవుస్మీ - ముఖ్యంగా 'కంట్రోల'యిన 'పెథిడ్రిన్, మార్ఫియా' లాంటివి. ఆమట్న నలుగురి నోళ్లలోనూ పడినట్టయినా... అదుగో ఆ డ్రగ్గిన్‌స్పెక్టరు పాణిగ్రాహి చండశాసనుడు. మనస్టోర్సు 'బ్లాక్ లిస్టు'లో పెట్టినా పెట్టవచ్చు. అంతేనా? స్టోర్సు లాక్‌చేసి 'డ్రగ్‌లైసెన్స్' రద్దుకి పైకి వ్రాసి ప్రాసిక్యూట్ చేసినా చేస్తాడు. ఏం చెప్పగలం? 'క్యాన్సిల్' చెయ్యనీ నాకు ఖాతరు లేదు, కానీ ఎంత తలవంపులు! పేరు నీదైనా 'స్టోర్సు' నాదని ఎవరికి తెలియదు? వచ్చిన వాదు చచ్చినా పోదుస్మీ, మంచి మనయిల్లు దాటదు, చెడుగన్నావూ వూరునాడూ మోగుతుంది. నేను జిల్లా 'మెడికల్ ప్రాక్టీషనర్స్ యూనియ'న్‌కి ప్రెసిడెంటుని కూడాను ఖర్మ. డాక్టర్లు వెలగబెట్టాల్సిన నీతి నిజాయితీ గురించి 'లెక్చర్లు' దంచుతున్నాను. లేని డబ్బుకోసం ఉన్న పరువు జూదంలో కాస్తే రెండూ ఊడి చక్కాబోగలవు. సంతలంజని నమ్మి ఇంటి ఇల్లాలిని వొదులుకున్నట్టవుతుంది జాగ్రత్త' అని సన్నసన్నగా హితబోధ చేస్తున్నట్టభినయించి, బేలగా నవ్వి తేల్చి పారేశాడు డాక్టరు.

ఈయనేమయినా వాసన పసిగట్టాడా యేం చెప్మా అనుకొంటో, పులుసులో ములక్కాడలు చీల్చాడు రామనాథం.

'అబ్బే - నేను అవుషధాలేవీ రహస్యంగా అమ్మటం లేదుస్మండీ' అని పాము చావకుండా కర్ర విరక్కుండా ముక్తసరిగా సమాధానమిచ్చి, మాటమార్చి, భోజనం ముగియగానే మామ్మూలుగా కాస్సేపు పిచ్చాపాటీ వేసుకునే అలవాటుకి భిన్నంగా, అమట్న, ఏదో అర్జంటుపని వున్నట్టు

కండవా భుజమ్మీద వేసుకుని, గబగబా మెట్లు దిగి బైటికి చక్కాబోయాడు రామనాథం.

రామనాథం అబద్ధం చెప్పలేదు. తెలివి తక్కువ నాగన్న సూటిగా అబద్ధం చెప్పి దొరికిపోతాడు. బుర్రలో గుంజున్న వాడు మాట మెలేస్తాడు. 'రహస్యంగా నేనేమీ అమ్మటం లేదూ' అన్నాడు రామనాథం, అది అక్షరాలా నిజం. 'బ్లాక్'లో బహిరంగంగానే అమ్ముతున్నాడు మందులు. ఇంకా బ్లాక్ ఏమిటి నా మొహం! అంతా వైటే!! అదీ అతని 'థియరీ.'

వెనక ఒకసారి చలమయ్యగారి పచారీ కొట్లో సారధ్యం వెలిగిస్తున్నప్పుడు, పంచదార చీకటిబజార్లో అమ్ముతున్నట్టు కేసొకటి వచ్చిపడింది. రామనాథం సాక్ష్యమివ్వాలిసొచ్చింది. ఆమట్న బోనెక్కి అడ్డకోలుగా వాదించాడు. 'అమ్మేవాడు, కొనేవాడూ ఉభయులికీ ఇష్టమై జరిగిన మార్పిడీ నేరమెట్లా అవుతుందండీ?' అని అతని వాదం. ఆమట్న బెంచీ కటూఇటూ నల్లకోట్లు వేసుకుని కంఠశోష పడుతున్న ప్లీడర్లిద్దరూ తెల్లమొహాలు వేశారట!

మేడమీద పక్క వరండాలో క్రోటన్ కుండీల మధ్య నడిచే ఇష్టాగోష్టిలో రామనాథం కొన్ని ప్రమాదకరమైన సూత్రాలే ఏకరువు పెడుతూ వచ్చాడు. నేరమంటే ఒక వ్యక్తి వల్ల మరో వ్యక్తికి జరిగే అన్యాయంట. 'కొనేవాడూ అమ్మేవాడూ లాలోచీ అయితే పట్టిచ్చేవాడేడీ?' అంటాడు.

ఇది మంచీ సెబ్బురా అని స్పష్టంగా గీట్లు కొట్టుకొని కూచునే మనస్తత్వం డాక్టరిది. ఆ గీతలు అటూఇటూ కాస్త కదిలినయ్యా, విలవిల లాడిపోతాడు. ఒక్కొక్కసారి రామనాథం ఆ గీతలు సుప్తాగా చెరిపెయ్యడానికి జంకడు.

అసలు 'స్టోర్సు' తాలూకు పద్దులే రెండు రకాల 'రిజిస్టర్ల'లో నమోదవుతున్నాయని డాక్టరికి తెలియదు. 'సేల్స్ టాక్స్ ఆఫీసరు' తణిఖీకని దాఖలు చేసేవి ఒక సెట్టూ, నిఖార్సుగా ఎంత మిగులుతున్నదో తేల్చి చూపేది మరొకసెట్టూ వేరువేరు. 'లేకపోతే వ్యాపారం చేసి మిడికినట్టే' అన్నాడొకసారి రామనాథం. అదీ రాజేశ్వరమ్మతో. డాక్టరుతో కాదు.

'సరేలే. ఈ వివరం బావకి తెలీనీకు' అని సరిపెట్టేసిందామె. 'సూటిగా పోవాలెనంటే నక్షత్రకుడెన్ని గుంటచిక్కులు పెట్టాడూ?' అని సత్యహరిశ్చంద్ర నాటక మొకసారి స్మరించుకున్నది కూడాను.

ఇంచుమించు వారానికొకసారన్నా రిజిస్టర్లు తిరగేయడంతో ఏ డ్రగ్గు ఎంత 'స్టాకు'లో వున్నదీ డాక్టరికి జ్ఞాపకముంటోనే వుంది. వైద్య పరిశోధనలు నానాటికీ ముందడుగు లేసుకొంటో పోతున్న యుగమాయెను; 'మెడికల్ జర్నల్స్' ఎప్పటికప్పుడు అధ్యయనం చేసుకొంటో కొత్తకొత్త వ్యాధులికి కొత్త కొత్త మందులు సరేసరి... పాతరోగాలకే సరికొత్తమందులు... పటుత్వం గల మందులు... వాడే అవసరం గుర్తించి... 'ప్రాక్టీసు' నడుపుకొంటోపోయే పద్ధతి డా. రాజారావుది. ఈమధ్య ఆ ప్రిన్సిపుల్‌కి భిన్నంగా గాడితప్పి నడుస్తోందాయన కలం. 'ప్రిస్క్రిప్షన్' చీటి వ్రాసే ముందు... 'సంజీవినీ మెడికల్ స్టోర్సు'లో అమ్ముడుపోకుండా నిలవున్న అవుషధాల తాలూకు జ్ఞాపకాలు... అనుకోకుండా మెదుల్తున్నాయి డాక్టరు మెదట్లో! ఏ వ్యాధికే 'డ్రగ్గు' చక్కగా పనిచేస్తుంది? అన్న యోచనా స్రవంతికి అడ్డంగా, సంజీవినీ మెడికల్ స్టోర్సులో మురిగిపోతున్న

మందుల ప్యాకేట్లూ... పాతగిల్లి విడుదల కోరుతున్న యాంపూల్సూ నిలబడుతున్నాయి.

డాక్టరుకి మహా చికాకుగా వుంది. తన ఇంట్లో ఆసుపత్రికి... బైట నడుస్తున్న మెడికల్ స్టోర్సుకి బాహ్యంగా సంబంధం లేకపోయినా... ఆ రెండు బాంధవ్యాలూ డాక్టరు మనసులో... తప్పనిసరిగా... ఆయనకి తెలీనంతగా... పెనవేసుకుపోతున్నయి. క్రమక్రమేణా. ఇన్నాళ్లూ రోగిమీదా రోటమ్మీదా కేంద్రీకృతమవుతూ వచ్చిన శ్రద్ధాసక్తులు, ఈనాడు, అంతకు కొంత, 'యక్స్-రే క్లినిక్కు'కి పని కలిపించడమ్మీదా, మెడికల్ స్టోర్సుని కూడగట్టుకుని రావడమ్మీదా... ప్రసరించకుండా... పల్చబడకుండా జాగర్తపడటం డాక్టరుకి... మానసికంగానే అనుకున్నా... ఓ పట్టాన సాధ్యం కావడంలేదు. సాధ్యం కాదు కూడాను. మనస్సు మహా క్లిష్టమైన యంత్రం. అందులో ఎన్ని స్వార్థాలు, ఎన్ని యుక్తులు, ఎన్ని జిత్తులు మారువేషం వేసుకుని పెత్తనం చెలాయిస్తాయనీ? అవసరమైనప్పుడది వాది కిందా ప్రతివాది క్రిందా విడిపోగలదు. అంతేనా - వాళ్లిద్దరూ తలపట్లు పట్టుకుంటుంటే విడదీసి... వాదోపవాదాలు సావధానంగా విని... జాగర్తగా తీర్పులిస్తున్నట్టు అభినయంచే జడ్జీగారిని గూడా సృష్టించి బెంచీమీదకి పంపుతుంది.

'ఈ రామనాథం ఎన్ని బెడదలు తెచ్చి పెట్టాడూ?' అని డాక్టరు స్వగతంగా చీదరించు కున్నాడేగాని... అతగాడు తన చెవులు పట్టుకుని ఆడిస్తున్నాడని కావేషీ పెంచుకుంటున్నాడేగాని... రామనాథం గుప్పిట్లో ఇరుక్కుపొమ్మని తనని శాసించిందెవరుటా? మనిషి తన పతనానికి కారణాలు బాహ్యంగానే వెదుక్కుని చక్కా వూరుకుంటాడు. తనలో దాగుడుమూతలాడుతున్న దవుర్బల్యాల వంక ఛస్తే చూపు సారించడు. చిత్రం!

'జిల్లా మెడికల్ కాన్ఫరెన్స్' 'ఎడ్రస్' చెయ్యాలిశుండి 'నోట్సు' తయారుచేసుకున్నాడు డా. రాజారావు. 'పెన్సిలిన్ ఇంజక్షన్లు' ఇప్పుడు సర్వేసర్వత్రా వాడుతున్నారు డాక్టర్లు. కాని 'ఇంజక్ష'నివ్వగానే కొంతమంది రోగులు 'షాక్' వచ్చి గిర్రున తిరిగి పడిపోతున్నారు. అంచాత ఆ 'ఇంజక్ష'న్లిచ్చేముందు 'పెన్సిలిన్' రోగివొంటికి పడుతుందా పడదా అని ఆరా చూచుకోవలిసొస్తోంది డాక్టర్లు. ఈ 'పడకపోవడాన్ని' 'ఎలర్జి' అంటున్నారు డాక్టర్లు. దానిమీద పరిశోధనలు జరగ్గా... 'పెన్సిలిన్ ఆయింటుమెంటు' తరుచువాడే 'పేషంట్లు' సర్వసాధారణంగా ఈ 'ఎలర్జీకీ' గురిఅవుతున్నారని తేలింది. ఆ 'ఆయింటుమెంటు' వాడకం నిషేధించాలిసిన అవసరమెంతేనా వుంది. ఆ పాయింటు 'నోట్సులో' వ్రాసుకున్నాడు డా. రాజారావు.

బయల్దేరేముందు 'నోట్సు' ఒకసారి తిరగెయ్యడంలో ఏమి స్ఫురణకొచ్చిందో మరి, చట్టున 'నోట్సు'లో ఆ భాగం కొట్టిపారేసి కాగితాలు పంట్లాం జేబులో కుక్కేసి 'కాన్ఫరెన్సు'కి వెళ్లిపోయాడు.

'కాన్ఫరెన్సయిం' తరవాత, సాయంత్రం 'క్లబ్బు'లో 'లాన్' మీద కూర్చుని 'గోల్డ్‌స్పాట్' తాగుతూ తీరిగ్గా ఆలోచించుకున్నాడు. తనెందుకు ఆ భాగం కొట్టేసినట్టు? 'కాన్ఫరెన్సు'లో ఎందుకు ఆ విషయమెత్తుకోలేదు తను? ప్రసక్తానుప్రసక్తంగా పెన్సిలిన్ ఆయింట్‌మెంటు నిషేధించాలీ అని అతను ప్రచారం చేసుకొంటోపోతే... 'సంజీవినీ' మెడికల్ స్టోర్సు'లో నిలవున్న 'పెన్సిలిన్ ట్యూబ్'లు అమ్ముడుకావన్న భయం లోపల పనిచేసిందా కొంపతీసి?

ఈ రామనాథం తన వ్యక్తిత్వాన్నే కలుషితం చేసి వదలిపెట్టినట్టున్నాడు. 'కీ' యిచ్చి వొదిలినట్టు అతనికిష్టమొచ్చిన విన్యాసంలో తన వూహాపోహలు మెలితిరిగి పోతున్నాయి ఖర్మ. తను పాపకూపంలో పడిపోతున్నాడా? ఇంతాజేసి 'పెన్సిలిన్ ఎలర్జీ'ని గురించిన పరిశోధనలప్పుడే ముగిసినట్టు లెక్కా? కొన్నాళ్లయింతరవాత..... వెనక్కి తిరిగి..... 'పెన్సిలిన్ ఆయింటుమెంటు'లో దోషమేమీలేదని తేలనూ వచ్చును. ఎన్ని చూట్టంలేదు? 'రిసెర్చి'కి అంతేముందీ? డాక్టరుగా తను చేసిన ద్రోహమేమున్నదీ ఇందులో?

తనవీపు తానే చరుచుకుని.... ఒక 'గార్డినాల్' మాత్ర వేసుకుని, 'సీలింగ్‌ఫాన్' మీట నొక్కి, 'వులెన్‌రగ్గు' మెడమీదికంటా లాక్కుని గాఢంగా నిద్రపోయాడు డాక్టరు.

*　　　*　　　*

ఆసుపత్రి 'కన్సల్‌టేషన్ రూం'లో కూచున్నాడు డాక్టరు. 'కాఫీ హొటల్ సర్వరొకడు వచ్చాడు. రక్తహీనంగా బలహీనంగా వున్నాడు. వైనవైనాలుగా అతగాడు చెప్పింది విన్నాడు డాక్టరు.

మలపరీక్ష అయిన తరువాత కడుపులో పాములున్నాయని నిర్ధారణ కొచ్చాడు డాక్టరు. 'పెప్పరజిన్ సిట్రేట్' బిళ్లలు తెచ్చుకొమ్మని 'ప్రిస్క్రిప్షన్' వ్రాసిచ్చాడు. 'సంజీవినీ స్టోర్సు'కి వెళ్లి దానికి బదులు 'సాన్‌టోనిన్' తెచ్చుకున్నాడు పేషెంటు.

'మీరు వ్రాసిచ్చింది లేదన్నారండి... ఇదీ దానికితూగే మందేంట' అన్నాడువాడు.

డాక్టరు ఆలోచించాడు. మొన్నమొన్ననే 'పెప్పర్‌జిన్ సిట్రేట్' కన్‌సైన్‌మెంటొకటి వచ్చినట్టు బాగా గుర్తు – 'డిస్ట్రిబ్యూటరు' 'స్టోర్సు' ముందు 'డెలివరీ వాన్' మీదనించి పేకేజీ పెట్టెలు దింపుతుండగా 'రవుండ్సు'లో తాను స్వయంగా చూశాడు కూడాను. అప్పుడే అయిపోయినయ్యా? అసంభవం. వాడి వ్యాధికి 'సాన్‌టోనిన్' సయితం పనిచేస్తుంది. కాని, దరిమిలా... దానికి ప్రత్యామ్నాయంగా వచ్చిందీ... అంతకన్నా రూఢీగా గుణమివ్వగలదీ 'పెప్పరజిన్ సిట్రేట్'. రామనాథం తను వ్రాసిన మందివ్వక 'సాన్‌టోనిన్' ఎందుకిచ్చాడో లీలగా అర్థమయింది డాక్టరికి. ఆ 'స్టాక్కు' టయిము దాటి నిల్వలు పేరుకుంటున్నాయి గావున – 'స్టోర్సు'లో.

ఆలోచనవాక కొలిక్కి రానేలేదు. 'ఇంజక్షన్'నిచ్చి 'పేషెంటు'ని పంపేశాడు.

తరవాత తరవాత గుర్తుకొచ్చింది డాక్టరికి. 'ఆల్బుమిన్' దోషమున్న 'పేషెంట్ల'కి 'సాన్‌టోనిన్' పడదు. తను 'ప్రిస్క్రయిబ్' చేసింది అదికాదుగదా అన్న భరోసామీద అతని నీరుడు పరీక్షకి పెట్టలేదు తను. దానాదీనా రోగమెంతకీ లొంగుబాటుకి రాలేదు. నాలుగు రోజులనుకున్నది ఇరవై రోజులు పట్టింది. ఆఖర్న తన 'సాంపుల్స్' లోనించీ 'పెప్పర్‌జిన్ సిట్రేట్' వాడిన తరువాతనే గుణం కనిపించింది. వాడికి 'హొటల్ ప్రొప్రయిటరు' ఇరవై రోజులు నాగా వ్రాశాడు పాపం. 'నన్నేమి చెయ్యమంటావురా?' అని నిష్ఠూరంగా మొహం పెట్టాడుగాని, డాక్టరు లోలోపల విలవిల్లాడిపోయాడు. వంకర నడకలు నడిచే అలవాటు లేని వాడికి కాస్తంత

క్రూరంగా పోవాలిసొస్తే ఎవరో గొంతు నులిమేస్తున్నట్టు గింగిరాలు తిరిగిపోతున్నాడు! స్వయం కృతాపరాధానికి శిక్షగా వాడి దగ్గరనించి దమ్మిడీ ఫీజు తీసుకోలేదక్కడికీనూ.

ఇలా వొకటేమిటి... టైఫాయిడొస్తే 'టెట్రా సైక్లిన్ సిరప్' తెచ్చాడొకపేషెంటు. అంతకన్న గుణమిచ్చేదీ... వెయ్యగానే పలికేది 'క్లోరోఫిని కాల్‌సిరప్' ప్రిస్క్రయిబ్ చేశాడు తను. ఈ రామనాధం... అక్కడ 'స్టోర్సు'లో ఖరాగా కూచుని..... ఏమీ ఎరగనట్టు... ఇక్కడ ఆసుపత్రిలో తన వైద్యాలన్నీ తారుమారు చేస్తున్నాడు త్రాష్టుడు!

రాత్రి భోజనానికి ముందు రామనాధాన్ని పట్టుకుని కడిగేశి వదిలిపెట్టాడు. తానొకటి వ్రాసిస్తే అతగాడు ఇంకోమందు చేతిలోపెట్టి పంపిన సందర్భాలన్నీ ఏకరువు పెట్టాడు.

'మీరు వ్రాసిన 'పెప్పర్‌జిన్ సిట్రేట్' స్టాకులో వున్నదనుకోండి. 'సాన్‌టొనిన్' మురిగిపోతుంది మరి. అది ముందు వొదిలించుకోవాలి గదాని?...' తలగోక్కున్నాడు రామనాధం.

'అంటే నీ వుద్దేశ్యమేమిటి? 'పలాని మందు' అని 'ప్రిస్క్రయిబ్' చేశేది నువ్వా నేనా? నీ ఇష్టమొచ్చిన మందులు నువ్విస్తుంటే ఇక నేనెందుకిక్కడ? ఈ ఆసుపత్రి కూడా నువ్వే నడుపు. నేను జపం చేసుకుంటూ కూచుంటాను.' అని ఒక్క కసురు కసిరాడు. డాక్టరు రాజారావు మొహం కండలుబ్బినై.

'మీ ఇష్టం... ఏదిమ్మనమంటే అదే ఇస్తా... నాదేం పోయిందీ? అసలు మీరొకసారి 'స్టాక్సు' విడివిడిగా పరిశీలించి ఏవేవి 'టయిం ఎక్స్‌పయిర'వుతున్నాయో...'

ఆర్ధోక్తిలో చర్రుమన్నాడు డాక్టరు.

'రాట్ – స్టాక్సూ చట్టుబండలూను. నా ఇష్టమొచ్చిన మందు నేను 'ప్రిస్క్రయిబ్' చేస్తాను. ఏది రాస్తే అదివ్వు. అది 'స్టోర్సు'లో లేకపోతే లేదని చెప్పు. ఇంకొక 'స్టోర్సు'కి వెళ్లి తెచ్చుకుంటాడు. అంతేగాని నీ బోడి పెత్తనమొకటా యిందులో?' రెచ్చిపోయాడు డాక్టరు.

గుక్కిళ్లు మ్రింగి బిరబిరా మెట్లుదిగి పొయ్యాడు రామనాధం.

తరువాత డాక్టరికి పశ్చాత్తాపం ముంచుకొచ్చింది. రామనాధాన్ని అనుకోవడం దేనికి? తనూ నిజానికి కొంత అస్తవ్యస్తంగానే 'ప్రిస్క్రయిబ్' చేస్తున్నాడు డ్రగ్గులు. తనకేదో వొరగ బెడదామని అతగాడు అడపాదడపా బురదలో అడుగువెయ్యనూ, తనచేత మొహం వాచేలా చివాట్లు తిననూ జరుగుతున్న తంతు. అతనేదో తనపట్ల అపచారం చేస్తున్నట్టు తేపతేపకీ నోరు చేసుకోవడం బాగుండలేదు. ఏదో బావమరిది కాబట్టి తలవొంచుకుని పోతున్నాడు మానవుడు అమట్న పారిపోకుండా. కాలునిలద్రొక్కుకుని, 'నువ్వొకటి వ్రాస్తే నేనొకటివ్వడం చూస్తుంటివి గదా... ఎందుకు తిరగ్గొట్టలేదూ? 'ఆ మందే పట్రమ్మని ఎందుకు పట్టుబట్టలేదూ?' అని ఎదురుదాడిచేస్తే... తన నోటికి తాళం పడదూ? ఈ వ్యాపరంలో తనూ రామనాధమూ లాలూనీ అన్న గుట్టు గుట్టుగా వున్నంతసేపే గాని... ఆ వాసెన కాస్తా తొలగించి కుండబద్దలుకొడితే మెతుకులు చెల్లాచెదరైపోవూ?

డాక్టరికి బెంగపట్టుకుంది. తను ఇట్లా దిగజారిపోతున్నాడేమిటి?

మెట్టుకి... ఈ వ్యాపారంలో తలదూర్చిన తరువాత తన 'ట్రీట్‌మెంటు' పద్ధతులు ఇదివరకంత వుదారంగా, ఉన్నతంగా, ఖచ్చితంగా నదుస్తున్నాయా అంటే లేదనే చెప్పుకోవాలి సొస్తుంది. తన బుద్ధి పెడతలబడుతోందా యేమిటి చెప్మా? కంపనబద్ధ కాకిలా గిలగిల కొట్టుకున్నాడు డా. రాజారావు. తేపతేపకీ 'బ్యాంక్ ప్యాస్ బుక్కు' లోవున్న అంకెల మీదకి దృష్టి పోతోంది. బుద్ధి గడ్డితింటోంది. ఏమి చెయ్యాలి?

* * *

కొయ్యగుర్రమెక్కి ఊగుతున్నాడు గోపీ.

చారల పైజామా వేసుకొంటో, ప్రయివేటు మాష్టారు రాలేదుట్రా?' అని కళ్లెరజేసి గదమాయించాడు డాక్టరు రాజారావు.

'మేష్టారు రాలేదు నాన్నా' అన్నాడు గోపీ, ఊగడం ఆపి.

'మేష్టారబ్బాయికి జ్వరమటండీ. మూడు రోజులనించీ రావటంలేదు. ఎలావుందో పాపం' అని టీ అందించింది రాజేశ్వరమ్మ.

చటుక్కున స్ఫురించింది డాక్టరికి. ఆ మధ్య మేష్టారు కుర్రాణ్ణి తీసుకొచ్చాడు ఏదో జ్వరమని. లోగడ ఆయనెప్పుడు వచ్చినా తన ఆసుపత్రిలో మందులే ఉచితంగా వాడనూ, 'ఫీజి'వ్వబోయినా తిప్పిగొట్టనూ జరుగుతున్నదేను. ఈసారి అందరితోపాటు అలవాటుగా ఆయనకీ 'ప్రిస్క్రిప్షన్' చీటీ వ్రాసిచ్చాడు. 'యాంపుల్స్' కొని తీసుకొచ్చాదాయన. నాలుగింజక్షన్లయిన తరువాత ఆయన మళ్లీ రాలేదు కుర్రాణ్ణి తీసుకుని. వ్యాధి తగ్గుముఖం పట్టగానే రోగులు తన దగ్గరికి రాకపోకలు తగ్గించడం ఆనవాయితీ వున్నదేను. అంతే అనుకుని పట్టించుకోనేలేదు తను.

మేష్టారు పెద్దవాడు, పేదవాడు, బహు కుటుంబీకుడు. భారంగా సంసారమీదుస్తున్న వాడు. ఏమయిందో ఏమో పాపం. సొంతకారు వేసుకుని మేష్టారింటికి వెళ్లాడు తిన్నగా.

ఇల్లు నానా దరిద్రంగానూ వుంది. అక్షరాలా అయ్యవారి నట్టిల్లు, కుర్రవాడు కుక్కి మంచంమీద పడివున్నాడు. ముక్కాలిపీట మీద మందులూ అరఖులూ పేర్చిపెట్టి వున్నాయి. ఇంట్లో అంతా గాబరాగా వున్నారు.

మేష్టారు క్షమించమని ప్రాధేయపడ్డాడు డా. రాజారావుని. వారంరోజులు చూచి... జ్వరమెంతకీ తగ్గకపోగా... ఇంకో డాక్టరి దగ్గర ట్రీట్‌మెంట్ ప్రారంభించాడు. అదీ కథ.

డాక్టరికి కోపం రాలేదు. సిగ్గువేసింది పైగా.

కొత్తడాక్టరు 'ప్రిస్క్రయిబ్' చేసిన 'డ్రగ్గే'మిటాని ముక్కాలిపీట మీద వున్న 'స్లిప్పు' పరీక్షగా చూసాడు డా. రాజారావు. స్టెప్టో పెన్సిలిన్ వ్రాసి వుంది. తలకొట్టేసినట్టయింది. అది న్యూమోనియా అని తెలిసిన్నీ, తను అన్నాళ్లూ 'సల్ఫా డైజిన్ ఇంజక్షని'స్తో పాతకాలపు వైద్యం చేసినట్టు

తెలిస్తే ఏ చిన్న డాక్టరయినా నవ్వుతాడు.

'సల్ఫాడైజిన్' మీదకి తన కలం ఎందుకు పోయిందో డా. రాజారావుకి తెలుసు. మవునంగా ఇంటికొచ్చి ముడుచుకుని పడుకున్నాడు. కుర్రవాడి పరిస్థితి ఏం బాగాలేదు. సరియైన డ్రగ్గు సకాలంలో పడలేదు.

*　　　　*　　　　*

మధ్యాహ్నం ఎండ మిటమిటలాడుతోంది.

అప్పుడే ఒక ఆపరేషన్ ముగించి 'వాష్ బేసిన్లో' చేతులు కడుక్కుంటుండగా మేష్టారబ్బాయికి ప్రాణంమీదకొచ్చిందని కబురొస్తే పరిగెత్తాడు.

వెళ్లేసరికి అంతా అయిపోయింది.

తిరిగొచ్చేసి కాస్త విశ్రాంతి తీసుకుందామని మెట్లెక్కి పైకొచ్చాడు.

రామనాథం మేడమీద 'వోపెన్ వరండా'లో కాచుకుని వున్నాడు.

గడిచిన క్వార్టర్లీ అంటే మూడు నెలల జమాఖర్చులూ చూపిద్దామని వచ్చాడు.

'రిజిస్టర్లూ', 'వోచర్లూ' అన్నీ టేబిలు మీద పరిచి వివరిస్తున్నాడు.

డాక్టరు మూతి బిడాయించుకుని కూచున్నాడు.

ఈ మెడికల్ స్టోర్సు డాక్టరిదే అనీ... ఆయన పెట్టుబడిమీదనే అది నడుస్తున్నదనీ... తానేదో బేడ వాటా తీసుకొంటున్నా నెలజీతగాణ్ణి మాత్రమేననీ... దానిమీద తన యాజమాన్యం నిమిత్తమాత్రమయిందనీ... అక్షర్శాలా కాదు గానీ... ఆ అర్థం వొచ్చేలా సంజాయిషీ ఇచ్చు కొంటూ పోయే ధోరణి రామనాథానిది.

'ముందూ వెనకా చూచుకోకుండా బావగారు 'ప్రిస్క్రిప్షన్లు' రాశేస్తున్నారు. ఈ నెలాఖరికి 'టయిమెక్స్పైర'య్యే మందులు బోలెడున్నాయి. తరువాత మీయిష్టం' అని 'రిజిస్టర్లు' మూసిపెట్టాడు రామనాథం.

డాక్టరు తాచుపాములా బుస్సుమని లేచాడు కుర్చీలోనుంచి.

అమట్న ఆ రిజిస్టర్లూ, మందులూ, బిల్లులూ... అన్నీ కలిపి రామనాథం మొహాన్ని కొట్టాడు.

'యు... యు... గెటవుట్ రాస్కెల్! నువ్వూ, నీ 'స్టోర్సూ' నీ 'స్టాక్సూ' గంగలో కలవండి. ఘడిఘడీకీ లాభనష్టాలు బేరీజు వేసుకొంటో 'ట్రీట్మెంట్లు' సాగించమంటావా నన్ను? ఆ మందు 'ప్రిస్క్రయిబ్' చెయ్యమనీ, ఈ మందు 'ప్రిస్క్రయిబ్' చెయ్యమనీ నాకు సలహా ఇవ్వు ఈసారి - తంతాను. ఇకనించీ ఆ 'స్టోర్సూ' ఆ 'క్లినిక్కూ'.. వాటి లాభనష్టాలతో నాకు నిమిత్తం లేదు - ఆ వ్యవహారాలన్నీ నీ నెత్తినే వేసుకుని వూరేగు - నాకొద్దు.

నువ్వు నా జీవితంలో అడుగు పెట్టక ముందు నేనొక డాక్టర్ని... రూపాయికి పదహారణాల డాక్టర్ని. అతిశయోక్తి... ఆత్మస్తుతి కాదు. అక్షరాల దేముడి డాక్టర్ని. ఈ రొంపిలోకి దిగిన తరువాత... నేనొక శిక్షపడని దొంగని... దగాకోరుని... ఆశ్చర్యంలేదు... ఒక హంతకుణ్ణి! మళ్లీ నీ మొహం నాకు చూపావా?... ఆ...' అని వూగిపోయాడు.

రామనాథం బిత్తరపోయి... కండువా చంక నెట్టుకుని... మాట పెగిలిరాక వొణికిపోతూ... ఆపాటున నిల్చుండిపోయాడు.

రాజేశ్వరమ్మ ఆ గలభాకి లోపలనించీ వొచ్చేసి... పెనిమిటి నరసింహావతారమ్మీద వున్నది గమనించి అప్రతిభురాలైపోయింది.

'ఇదిగో నువ్వింందులో తలదూర్చావా... మాట దక్కదు' అని ఆమె వంక ఒక్క ఉరుమురుమి, లోపలికి దూరి గడియవేసుకున్నాడు డాక్టరు.

* * *

మర్నాడు ఉదయం 'కన్సల్టింగ్ రూం'లో కూచున్నాడు డాక్టరు. ఆయన ముఖం ప్రసన్నంగా వుంది. కిటికీలో నించీ రాత్తిరంతా మంచులో తడిచిన మాలతి తెల్లగా పరి శుభ్రంగా మెరుస్తోంది.

కనపడని సంకెళ్లోవో విదుల్చుకున్నట్టయి... ఒక్కసారి వొళ్లు విరుచుకున్నాడు. మిస్టర్ రాజారావు మళ్లీ డాక్టర్ రాజారావయ్యాడు ఆ క్షణం.